సాక్షి
చిత్తూరు

శుక్రవారం । 26 । ఏప్రిల్ । 2024



వైఎస్సార్‌సీపీలోకి వలసలు
జిల్లాలోని పలు నియోజకవర్గాల్లో టీడీపీ, జనసేన నేతలు వైఎస్సార్‌సీపీలో గురువారం చేరారు. - IIలో



టీడీపీ నేత నిర్వాకం!
బైరెడ్డిపల్లె మండలంలో టీఎన్‌కుప్పం వెళ్లే సీసీ రోడ్డును స్థానిక టీడీపీ నేత యథేచ్ఛగా ధ్వంసం చేశాడు. - IIలో



ముగిసిన నామినేషన్ల ఘట్టం
సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా గురువారంతో నామినేషన్ల ఘట్టం ముగిసింది. నేడు నామినేషన్ల పరిశీలన జరగనుంది. - IIలో

న్యూస్‌రీల్

జనరల్ అబ్జర్వర్‌కు స్వాగతం



షాధిక్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న కలెక్టర్ షణ్మోహన్

చిత్తూరు కలెక్టరేట్ : సార్వత్రిక ఎన్నికల పర్యవేక్షణకు కేంద్ర ఎన్నికల సంఘం నియమించిన జనరల్ అబ్జర్వర్ ఎండీ షాధిక్ గురువారం చిత్తూరుకు విచ్చేశారు. ఆర్‌అండ్‌బీ అతిథి గృహం వద్ద ఆయనకు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ షణ్మోహన్ పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. చిత్తూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఎన్నికల ప్రక్రియను షాధిక్ పర్యవేక్షించనున్నారు. ఎన్నికలను సజావుగా, పారదర్శకంగా నిర్వహించేందుకు కృషి చేస్తానని జనరల్ అబ్జర్వర్ వెల్లడించారు.

ఆర్‌ఓకు మంత్రి పెద్దిరెడ్డి తరఫున బీ-ఫామ్



ఆర్‌ఓకు బీ-ఫామ్ అందిస్తున్న వెంకటరెడ్డి యాదవ్, అలీమ్‌బాషా

పుంగనూరు : వైఎస్సార్‌సీపీ పుంగనూరు ఎమ్మెల్యే అభ్యర్థి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి బీ-ఫామ్‌ను రిటర్నింగ్ అధికారికి పీకేఎం ఉడా చైర్మన్ వెంకటరెడ్డి యాదవ్, మున్సిపల్ చైర్మన్ అందించారు. గురువారం ఈ మేరకు మంత్రి పెద్దిరెడ్డి తరఫున రెండు సెట్ల నామినేషన్లు, ఆయన సతీమణి స్వర్ణలత తరఫున రెండుసెట్ల నామినేషన్లు దాఖలు చేశారు. కార్యక్రమంలో సీమ జిల్లాల మైనారిటీ సెల్ ఇన్‌చార్జ్ ఫకృద్దీన్ షరీఫ్, ఏఎంసీ చైర్మన్ అమరనాథరెడ్డి, సున్ని అంజుమన్ కమిటీ అధ్యక్షుడు ఇనాయతుల్లా షరీఫ్, న్యాయవాదులు మధుసూదన్‌రెడ్డి, ప్రకాష్, సుధాకర్‌రెడ్డి, రమణారెడ్డి పాల్గొన్నారు.


మే 24 నుంచి ఇంటర్ సప్లిమెంటరీ

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలో మే 24వ తేదీ నుంచి ఇంటర్మీడియట్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించనున్నట్లు ఆర్‌ఐఓ సయ్యద్‌మౌలా వెల్లడించారు. గురువారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ షెడ్యూల్ ప్రకారం జూన్ 1వ తేదీ వరకు పరీక్షలు కొనసాగుతాయన్నారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఫస్టియర్, మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు ద్వితీయ సంవత్సరం పరీక్షలుంటాయని వివరించారు. జూన్ 6న ఎథిక్స్ అండ్ హ్యూమన్ వ్యాల్యూస్, 7న పర్యావరణ పరీక్ష నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఈ క్రమంలోనే మే 1 నుంచి 4వ తేదీ వరకు ప్రాక్టికల్ పరీక్షలు ఉంటాయని తెలిపారు.

పాఠశాలల్లోనే ప్రధానోపాధ్యాయులు

చిత్తూరు కలెక్టరేట్ : వేసవి సెలవుల్లోనూ ఉన్నత పాఠశాలల్లో ప్రధానోపాధ్యాయులు అందుబాటులో ఉండాలని డీఈఓ దేవరాజు తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ విద్యార్థులు, తల్లిదండ్రుల సౌకర్యార్థం హెడ్ మాస్టర్‌లు పాఠశాలల్లో ఉంటూ పరీక్షల ఫీజులు కట్టించుకోవాలన్నారు. మే లో నిర్వహించే పది సప్లిమెంటరీ పరీక్షలకు సంబంధిత విద్యార్థులు ఫీజులు చెల్లించాల్సి ఉంటుందన్నారు. www.bse.ap.gov.in వెబ్‌సైట్‌లో ఈ నెల 30వ తేదీలోపు ఫీజు చెల్లించాలని తెలిపారు. 3 కంటే ఎక్కువ సబ్జెక్టుల్లో ఫెయిల్ అయిన వారు రూ.125, 3 కంటే తక్కువ సబ్జెక్టులున్న వారు రూ.110 పరీక్ష ఫీజును చెల్లించాల్సి ఉంటుందన్నారు. ప్రభుత్వం నిర్ణయించిన ఫీజు కంటే ఎక్కువ వసూలు చేస్తున్నట్లు ఫిర్యాదులు అందితే కఠిన చర్యలుంటాయని హెచ్చరించారు. రీ కౌంటింగ్, రీ వెరిఫికేషన్‌కు ఆసక్తి గల విద్యార్థులు ఈ నెల 30వ తేదీ రాత్రి 11 గంటల వరకు సంబంధిత పాఠశాలల హెచ్‌ఎంల ద్వారా దరఖాస్తులు చేసుకోవాలన్నారు. గడువు తేదీలు ఎట్టిపరిస్థితుల్లోనూ పొడిగించబడవని డీఈఓ స్పష్టం చేశారు.

మలేరియా నిర్మూలనకు కృషి



మాట్లాడుతున్న డీఎంహెచ్ ప్రభావతీదేవి

చిత్తూరు రూరల్(కాణిపాకం): మలేరియా నిర్మూలనకు కృషి చేయాలని డీఎంహెచ్ఓ ప్రభావతీదేవి ఆదేశించారు. గురువారం చిత్తూరులోని వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో ప్రపంచ మలేరియా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ర్యాలీ చేపట్టారు. అనంతరం మాట్లాడుతూ దోమల వ్యాప్తిని అరికట్టేందుకు పరిసరాల పరిశుభ్రత పాటించాలన్నారు. నీటి నిల్వలు లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు.

నివాస నాటకం!

ఎన్నికల్లో ఎలా విజయం సాధించాలి.. ఎలా ఓట్లు రాబట్టాలి.. ఎలా అధికారంలోకి రావాలి.. ఇచ్చిన హామీలను ఎలా తుంగలో తొక్కాలి.. ప్రజలను ఎలా మోసం చేయాలి.. ఈ విధానాలతోనే టీడీపీ అధినేత చంద్రబాబు గత నలభై ఏళ్లుగా రాజకీయాలు సాగిస్తున్నారు. తన స్వార్థ ప్రయోజనాల కోసం ఆయన ఎవరికైనా వెన్నుపోటు పొడిచేస్తారు. నమ్మిన వారిని సైతం నిర్దాక్షిణ్యంగా నట్టేట ముంచేస్తారు. అది పిల్లనిచ్చిన మామ కావచ్చు.. వెంట నడిచిన నేత కావచ్చు.. పొత్తు పెట్టుకున్న పార్టీ కావచ్చు.. ఎవరైనా ఒకటే. అందితే జుట్టు.. అందకపోతే కాళ్లు.. ఇదే సిద్ధాంతం పాటిస్తూ తీరని అపప్రథను మూటగట్టుకున్నారు. ఈ ఉపోద్ఘాతమంతా ఎందుకంటే.. సుమారు 35 ఏళ్లుగా కుప్పం నియోజకవర్గానికి చంద్రబాబు ఎమ్మెల్యేగా ప్రాతినిథ్యం వహిస్తున్నారు. అయితే ఇప్పటికీ ఆయనకు స్థానికంగా సొంతిల్లు లేదు.. కనీసం కార్యాలయం కూడా లేదు. ఇన్నేళ్లు ఇదేంటని ప్రశ్నించినవారూ లేరు. ఈ క్రమంలో స్థానిక సంస్థల ఎన్నికల్లో ఓటమితో కుప్పంలోనూ బాబు ఉనికి ప్రమాదంలో పడింది. దీంతో తాను ఇక్కడే స్థిర నివాసముంటా అంటూ సరికొత్త నాటకాలకు తెరతీశారు. దాదాపు మూడేళ్లుగా ఇల్లు నిర్మిస్తూనే ఉన్నారు. ప్రజలను మభ్య పెట్టేందుకు డ్రామాలు కొనసాగిస్తూనే ఉన్నారు.

- మూడేళ్లుగా కొనసా..గుతున్న చంద్రబాబు సొంతింటి నిర్మాణ పనులు
- కుప్పం వాసులను మభ్యపెట్టేందుకే ఎత్తుగడలు
- ఓట్ల కోసమే రాజకీయ డ్రామాలు
- జిమ్మిక్కులను నమ్మేది లేదంటున్న ప్రజలు



ఏళ్ల తరబడి నిర్మిస్తున్న చంద్రబాబు ఇల్లు

శాంతిపురం : మూడున్నర దశాబ్దాలుగా వరుసగా ఎన్నికల్లో గెలిపిస్తూ వచ్చిన కుప్పం ప్రజలకు చంద్రబాబు ఎప్పుడూ అందుబాటులో ఉండేవారు కాదు. ఇనేళ్లలో సొంత నియోజకవర్గంలో ఇల్లు కట్టుకోవాలనే ఆలోచన కూడా చేయలేదు. ప్రజల సౌకర్యం కోసం ఎమ్మెల్యే కార్యాలయాన్ని కూడా ఏర్పాటు చేసుకోలేదు. దీనిపై విమర్శలు వెల్లువెత్తడంతో మూడేళ్ల క్రితం కుప్పంలో సొంత ఇంటి డ్రామాను మొదలు పెట్టారు. శాంతిపురం మండలంలోని శివపురం క్రాస్ (చిన్న కడపల్లి పక్కన) వద్ద ఇంటి నిర్మాణం మొదలు పెట్టినా అది ఎప్పటికి పూర్తవుతుందనేది ప్రశ్నార్థకంగానే మారింది. స్థానికంగా సొంత ఇల్లు కట్టుకుంటున్నామని కుప్పం వాసులను నమ్మించి ఓట్లు దండుకోవటానికే ఈ నాటకాలకు తెరతీశారని స్థానికులు బహిరంగంగానే ఆరోపిస్తున్నారు.

ప్రభుత్వంపై నిందలు!

ప్రభుత్వం నుంచి ఒక అనుమతి కావాలంటే సక్రమంగా దరఖాస్తు చేసుకోవాలి. 40 ఏళ్ల రాజకీయ అనుభవం, 14 ఏళ్ల ముఖ్యమంత్రిగా పని చేసిన చంద్రబాబుకు ఇది తెలియంది కాదు. కానీ ఇంటి నిర్మాణం కోసం సరైన అనుబంధ పత్రాలు లేకుండా పీకేఎం ఉడా(పలమనేరు, కుప్పం, మదనపల్లె అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ)కి దరఖాస్తు చేసుకున్నారు. సంబంధిత డాక్యుమెంట్లు ఇవ్వాలని అధికారులు కోరినా పెడచెవిన పెట్టారు. పైగా ప్రభుత్వం తమ ఇంటి నిర్మాణానికి అనుమతులు ఇవ్వడం లేదని విమర్శలకు దిగారు. ఎట్టకేలకు పూర్తి స్థాయి దరఖాస్తు అందడంతో అధికారులు అనుమతులు జారీ చేశారు.

మరో ఐదేళ్లకైనా పూర్తయ్యేనా..?

చిన్నకడపల్లి(శివపురం) వద్ద కదిరి ఓబనపల్లె రెవెన్యూ సర్వే నంబర్లు 7/6బి/1బి1ఏ, 7/6బి/2ఏ, 7/6సి2లలోని 1.76 ఎకరాల వ్యవసాయ భూమిని నారా చంద్రబాబునాయుడు పేరిట కొనుగోలు చేశారు. దీని పక్కనే ఆయన వ్యక్తిగత కార్యదర్శి మనోహర్ పేరిట మరో 0.70 ఎకరాలను కొనుక్కున్నారు. కుప్పం-పలమనేరు జాతీయ రహదారి పక్కన ఉన్న ఈ భూములను ల్యాండ్ కన్వర్షన్ చేయించుకుని 2021లో నిర్మాణ పనులను ప్రారంభించారు. భూమి చదును చేసి ప్రహరీ, భవన నిర్మాణం మొదలు పెట్టారు. మొదట ఒకటి, తర్వాత మరోటి, ఆపై ఇంకోటి ఇలా మూడు భవనాలను నిర్మిస్తున్నారు. కానీ ప్రహరీ గోడతో సహా ఏ ఒక్క పని పూర్తి చేయలేదు. దేశంలోనే సంపన్నవంతమైన రాజకీయ నేతల్లో ఒకరైన చంద్రబాబు, ఆయన కుటుంబం తలచుకుంటే నెలల వ్యవధిలో ఇంటి నిర్మాణం పూర్తయ్యే అవకాశముంది. అయినప్పటికీ ఏళ్ల తరబడి నిర్మాణ పనులు సాగుతున్నాయి. ఇదే రీతిలో పనులు సాగితే మరో ఐదేళ్లకు కూడా ఇంటి పనులు పూర్తి కావని స్థానికులు అంటున్నారు.



నత్త నడకన నిర్మాణం

హైదరాబాద్‌ను అభివృద్ధి చేశా.. సైబరాబాద్‌ను నిర్మించా.. అమరావతిని అద్భుతంగా కట్టేశా అని గొప్పలు చెప్పుకునే చంద్రబాబు కుప్పంలో సొంతింటిని మాత్రం మూడేళ్లుగా కట్టిస్తూనే ఉన్నారు. పేద, మధ్యతరగతివారు ఇల్లు నిర్మించుకోవాలంటే ఆర్థిక ఇబ్బందులతో జాప్యం కావడం సహజం. అయితే తన కంపెనీలో 2 శాతం షేర్లు అమ్మినా రూ.400 కోట్లకు పైగా వస్తుందని వెల్లడించిన నారా భువనేశ్వరి భర్తగా, ఏడీఆర్ రిపోర్టు ప్రకారం దేశంలోని ధనవంతులైన ఎమ్మెల్యేల్లో మూడో స్థానంలో ఉన్న చంద్రబాబు ఇంటి నిర్మాణం ఏళ్ల తరబడి సాగు.. తూనే ఉంది. మూడేళ్లలో కనీసం ప్రహరీ గోడ నిర్మాణం కూడా పూర్తి చేయలేకపోయారు. సొంత ఇంటినే ఏళ్ల తరబడి కట్టుకోలేని చంద్రబాబుకు అవకాశం ఇస్తే రాష్ట్ర రాజధానిగా అమరావతిని మాత్రం ఎలా కట్టిస్తారని పలువురు విమర్శిస్తున్నారు.



ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్టుగా...



రిసార్టును గుర్తుకుతెస్తున్న నిర్మాణం

అంతా డ్రామాలు



మా ఊరి పక్కన చంద్రబాబునాయుడు ఇల్లు కట్టుకుంటున్నారని ఆనందించాం. ఆయన ఇంటికి జనాలు ఎక్కువగా వచ్చి పక్కనే నా చిల్లర దుకాణంలో వ్యాపారం బాగా పెరుగుతుందని అనుకున్నా. కానీ, మూడేళ్లుగా ఇంటి పనులు జరుగుతున్న తీరును చూశాక అదంతా డ్రామాలనే అనిపిస్తోంది. కుప్పంలో నేనూ ఇల్లు కట్టుకుంటున్నా అంటూ మాలాంటి వాళ్లని ఏమార్చడం తప్పా ఇక్కడ ఉండే ఉద్దేశం చంద్రబాబుకు ఉన్నట్టు లేదు.

– మురుగేష్, చిన్నకడపల్లె

నెలలో రెండు రోజులే..



చంద్రబాబు ఇట్లు కట్టే పని నెలలో రెండు, మూడు దినాలే చేస్తుంటారు. తక్కువ మంది కూలీలతో, అప్పుడప్పుడూ మొక్కుబడిగా పనులు చేస్తుంటారు. ఈ విషయమై కూలీలను అడిగితే పెద్దవాళ్లు చెప్పిన పనులు, చెప్పినప్పుడు మాత్రమే చేస్తున్నామన్నారు. 2029 ఎలక్షన్ల వరకూ కూడా చంద్రబాబు ఇంటి పని పూర్తవుతుందో, లేదో అని మా ఊర్లో అందరూ అనుకుంటున్నారు.

– శ్యామరాజు, చిన్నకడపల్లె

అది ఇల్లే కాదంటున్నారు!



మా ఊరి దగ్గర చంద్రబాబు కట్టిస్తున్నది ఇల్లే కాదని స్థానికంగా ప్రచారం ఉంది. గతంలో అక్కడ పనిచేసే కూలీలు మాట్లాడుతూ రిసార్ట్ కడుతున్నామని చెప్పారు. ఈ విషయం ప్రచారం కావడంతో పనులు చేస్తున్న కూలీలను వెళ్లగొట్టి హిందీ మాట్లాడే వాళ్లని తెచ్చిపెట్టారు. వాళ్లకు తెలుగు రాదు. ఇక్కడ ఎవరికీ హిందీ రాదు. నిజంగా చంద్రబాబు ఇల్లు కట్టిస్తుంటే అది ఎప్పుడో పూర్తి చేసేవాళ్లు. అప్పుడప్పుడూ మాత్రమే పనులు జరుగుతున్నాయి.

– సోమశేఖర్, కదిరిఓబనపల్లె

ఇక రాజధాని కట్టినట్టే?



నలభై ఏళ్ల అనుభవం ఉన్న చంద్రబాబు మూడేళ్లలో తన ఇంటినే కట్టుకోలేకపోతే ఇ రాజధానిని కట్టినట్టే? అధికారంలో ఉండగా ఇక్కడ విమానాశ్రయం నిర్మిస్తామని మావాళ్ల భూములన్నీ లాక్కుని, ఊర్లు కూడా ఖాళీ చేయించాలని చూశారు. దీంతో స్థానికుల్లో చంద్రబాబుపై చాలా వ్యతిరేకత వచ్చింది. దానిని కవర్ చేసి, జనాన్ని మచ్చిక చేసుకునేందుకే ఇక్కడ ఇల్లు కడుతున్నట్టు నాటకాలు ఆడుతున్నారు. నిజంగా ఆయన ఇళ్లు కట్టాలంటే ఎప్పుడో పూర్తయ్యేది.

– మురుగేష్, కడపల్లె

సమన్యాయం..
టీడీపీలో శూన్యం!

"ఎవరైనా ఎస్సీల్లో పుట్టాలనుకుంటారా? .. కోడలు మగ బిడ్డ కంటానంటే వద్దంటామా?" అంటూ చంద్రబాబు ఇప్పటికే పలు సందర్భాల్లో తన అసలు నైజం చూపించారు. మళ్లీ ఇప్పుడు ఎన్నికల్లో బీసీలు.. మహిళలకు మొండిచేయి చూపించి మరోసారి తన వివక్షను బయటపెట్టారు. టీడీపీ అంటే బలహీన వర్గాల పార్టీ.. ఆడపడుచులకే అగ్రతాంబూలమంటూ ఊకదంపుడు ఉపన్యాసాలు వల్లించే చంద్రబాబు తీరా ఎన్నికలు వచ్చేసరికి డబ్బున్నవారికే పెద్దపీట వేశారు. తన మాటలు.. చేతలకు అస్సలు పొంతన ఉండదని మరో పర్యాయం రుజువు చేసుకున్నారు.

- అగ్రవర్ణాలకే అందలం
- బీసీలు, మహిళలకు మొండిచేయి
- చంద్రబాబు వైఖరిపై వెల్లువెత్తిన విమర్శలు

సాక్షి, చిత్తూరు: జిల్లాలో ఒక పార్లమెంట్, ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలు ఉన్నాయి. ఇప్పటికే ప్రధాన పార్టీలతో పాటు ఇతర పార్టీలు, స్వతంత్ర అభ్యర్థులు నామినేషన్లు వేశారు. గడువు కూడా గురువారం సాయంత్రం 3 గంటలతో ముగిసింది. ఇక మిగిలింది నామినేషన్ల పరిశీలన, ఉప సంహరణతో రేసులో ఎవరు ఉంటారన్నది ఈనెల 29వ తేదీతో తేలిపోతుంది. ఈక్రమంలో జిల్లా ఒక్క సీటు కూడా బీసీలు, మహిళలకు టీడీపీ కేటాయించకపోవడంపై ఆయా వర్గాల వారు మండపడుతున్నారుజ.

కుప్పంలో 60 శాతంపైగా బీసీ ఓటర్లే..

కుప్పంలో మొత్తం 2,23,174 మంది ఓటర్లు ఉన్నారు. ఇందులో 60 శాతంపైగా బీసీలే ఉన్నారు. అయితే, 1989 నుంచి చంద్రబాబు ఇప్పటికే 7 సార్లు పోటీ చేసి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. 14 ఏళ్ల ముఖ్యమంత్రిగా పనిచేశారు. అయితే అధిక సంఖ్యలో బీసీ ఓటర్లు ఉన్న స్థానంలో జనరల్ కేటగిరీలో చంద్రబాబు ఎలా పోటీ చేస్తున్నారు? అన్న చర్చ కుప్పంలో సాగుతోంది. నిజంగా చంద్రబాబుకు బీసీలంటే ప్రేముంటే బీసీ అభ్యర్థికి టికెట్టు ఇచ్చి గెలిపించుకోవచ్చుకదా? అంటూ వ్యాఖ్యానిస్తున్నారు. ఈ ఎన్నికల్లో చంద్రబాబుకు షాక్ ఇవ్వాలని కుప్పం వాసులు నిర్ణయించుకున్నట్లు సమాచారం.

బీసీ నినాదం అంటే ఇదేనా..?

ఇంట గెలిచి రచ్చ గెలవాలి అంటారు? కాని చంద్రబాబు మాత్రం ఇందుకు విరుద్ధంగా ఉంటారని ప్రచారంలో ఉంది. సొంత జిల్లాలోనూ టికెట్ల కేటాయింపులో చంద్రబాబు ఎక్కడా సామాజిక న్యాయం పాటించలేదు. ప్రధానంగా బీసీలకే ఎగనామం పెట్టారు. రెండు రిజర్వుడు అసెంబ్లీ స్థానాలు మినహా మిగిలిన ఐదు స్థానాల్లో ఒక్కటీ బీసీలకు కేటాయించలేదు. ఎప్పుడూ బీసీల జపం చేసే చంద్రబాబు.. ఆ ప్రేమను చేతల్లో చూపలేదని ఆయా వర్గాలు ఆగ్రహంతో ఉన్నాయి. బీసీలు రాజకీయంగా, సామాజికంగా, ఆర్థికంగా ఎదగడం ఇష్టం లేకనే ఒక్క స్థానం కూడా కేటాయించలేదని పలువురు విమర్శిస్తున్నారు. ఎన్నికల్లో ఓటుతో చంద్రబాబుకు బుద్ధి చెబుతామని బీసీలు స్పష్టం చేస్తున్నారు.

కానరాని మహిళా అభ్యర్థి..

మహిళాభివృద్ధి టీడీపీ చిత్తశుద్ధితో పనిచేస్తుందని చంద్రబాబు పదేపదే చెబుతుంటారు. కానీ, వాటిని ఏమాత్రం పాటించరు. అందుకే జిల్లాలో మహిళా అభ్యర్థికి చోటు కల్పించలేదు. దీనిపై మహిళా లోకం మండిపడుతోంది. నయవంచన చంద్రబాబుకు అలవాటేనని, ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థులకు బుద్ధి చెబుతామని స్పష్టం చేస్తోంది.



అగ్ర వర్ణాలకే పచ్చజెండా ఊపిన బాబు

చంద్రబాబు తన సొంత జిల్లాలోని. ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో పూతలపట్టు, జీడీ నెల్లూరు ఎస్సీ స్థానాల మినహా మిగిలిన ఐదు స్థానాల్లోనూ అగ్రవర్ణాలకే చోటు కల్పించారు. ఇందులో తనతోపాటు తన సామాజిక వర్గానికి చెందిన గురజాల జగన్‌మోహన్‌నాయుడుకు చిత్తూరు, గాలి భానుప్రకాష్ నాయుడుకి నగరికి టికెట్లు కేటాయించారు. ఇక పలమనేరులో అమర్‌నాథరెడ్డి, పుంగనూరులో చల్లా రామచంద్రారెడ్డికి టికెట్ ఇచ్చారు. అందరికీ బీ-ఫామ్‌లు కూడా స్వయంగా అందించారు.

ఒక్క మహిళకూ అవకాశం ఇవ్వలేదు



మహిళలకు టీడీపీ చేసింది శూన్యం. డ్వాక్రారుణాలు మాఫీ చేస్తామన్నారు చేయలేదు. పసుపు-కుంకుమ అంటూ మభ్యపెట్టాలని చూశారు. అందుకే టీడీపీని ఇంటికి పంపాం. ఈ ఎన్నికల్లోను ఎమ్మెల్యేగా ఒక్క మహిళకు అవకాశం కల్పించలేదు. వైఎస్సార్‌సీపీ మాత్రమే మహిళలకు ప్రాధాన్యత ఇస్తోంది. జిల్లాలో ఇద్దరు మహిళలకు ఎమ్మెల్యేగా అవకాశం ఇచ్చింది. అంతేగాక ప్రతి పథకాన్ని మహిళల పేరిటనే ప్రభుత్వం అమలుచేసింది. మాట ప్రకారం ఆసరాతో రుణ మాఫీ చేసింది. చేయూతతో మా అభివృద్ధికి అండగా నిలిచింది.

– మీనా, చవరంబాకం, నింద్ర మండలం


బీసీలను అణగదొక్కుతున్నారు



చంద్రబాబు బీసీలపై చూపిస్తున్నది కేవలం కపట ప్రేమే. 35 ఏళ్లుగా బీసీలు అధికంగా ఉన్న కుప్పంలో తిష్ట వేశారు. ఇక్కడ బీసీలను రాజ్యాధికారంలోకి రాకుండా అణగదొక్కుతున్నా రు. రాజకీయ లబ్ధి కోసమే బీసీలను వాడుకుంటున్నారు. మాకు చేసింది శూన్యం. మోసపూరిత మాటలతో కుప్పం ప్రజలను నమ్మించి నట్టేట ముంచారు. 60శాతం బీసీలున్న కుప్పంలో చంద్రబాబు పక్కకు తప్పుకుని బీసీ అభ్యర్థికి ఎందుకు టికెట్టు ఇవ్వకూడదు? అవసరానికి వాడుకుని వదిలేసే వ్యక్తి చంద్రబాబు.

– మాధవి, ఎన్టీఆర్‌కాలనీ, కుప్పం


బీసీలకు చేసిందేమీలేదు



బీసీలకు టీడీపీ చేసిందేమీ లేదు. జిల్లాలో బీసీలకు ఒక్క సీటు కూడా ఇవ్వలేదు. పెత్తందార్లు, అగ్రకులాలకే పెద్దపీట వేసింది. బీసీలకు న్యాయం చేసింది వైఎస్సార్‌సీపీ మాత్రమే. బీసీలకు ఎమ్మెల్యేలుగా అవకాశం ఇవ్వడంతో పాటు బీసీ కార్పొరేషన్‌ను భజించి అన్ని కులాలకు ప్రాధాన్యతఇచ్చారు. కార్పొరేషన్ డైరెక్టర్లుగా అవకాశం కల్పించారు. టీడీపీ దృష్టిలో బీసీలంటే ఓటు బ్యాంకు మాత్రమే.

– జగన్నాథం, సత్రవాడ, నగరి

చంద్రబాబుది కపట ప్రేమ



బీసీలు బ్యాక్ బోన్ అని ఎన్నికల ప్రచారాల్లో డీజే పాటలు పెట్టి బీసీలను ఏమార్చుతున్నారు చంద్రబాబు. ఆయనకు నిజంగా బీసీలపై ప్రేమ లేదు. బీసీలను ఏమారుస్తూనే చంద్రబాబు పబ్బం గడుపుకుంటున్నాడు. ఆయనకు నిజంగా బీసీలపై అభిమానం ఉంటే కుప్పంలో బీసీని నిలబెట్ట వచ్చు. అదే వైఎస్సార్‌సీపీ కుప్పంలో బీసీకే టికెట్ ఇచ్చింది. మా బీసీల దెబ్బ ఎలా ఉంటుందో ఎన్నికల్లో చూపిస్తాం.

– టీకే షణ్ముగం, బీసీ నేత, పలమనేరు

రాబోయేది జగనన్న రాజ్యమే



పలమనేరులో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి వెంకటేగౌడ

పలమనేరు : వైఎస్సార్‌సీపీ మళ్లీ అధికారంలోకి వస్తుందని, రాబోయేది జగనన్న రాజ్యమే అని ఎమ్మెల్యే అభ్యర్థి వెంకటేగౌడ, జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు స్పష్టం చేశారు. గురువారం పట్టణంలో సుపర్‌బజార్ అధ్యక్షుడు సుభాష్‌చంద్రబోస్, నాయకుడు గణేష్‌యాదవ్‌తో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. వారు మాట్లాడుతూ సొంత తమ్ముడికే ఏం చేయని మాజీ మంత్రి అమరనాథరెడ్డి ఇక జనాలకు ఏం చేస్తారని ప్రశ్నించారు. ఆయన అధికారంలో ఉన్నప్పుడు ప్రజలకు మంచి చేసుంటే ఎందుకు ఓడించారన్నారు. పేదలకు సంక్షేమ పథకాలందుతున్నాయి కాబట్టే మేలు చేసుంటేనే ఓటేయాలని ముఖ్యమంత్రి జగనన్న ధైర్యంగా చెప్పారని వెల్లడించారు. వలంటీర్లు సైతం రాజీనామా చేసి పార్టీలోకి చేరారని, కానీ వైఎస్సార్‌సీపీలో ఎమ్మెల్యేగా గెలిచిన అమరనాథ్‌రెడ్డి మాత్రం పదవికి రాజీనామా చేయకుండానే టీడీపీలో చేరారని విమర్శించారు. జగనన్నపై జనాలకు నమ్మకం ఉందని, చంద్రబాబు మాయమాటలకు మోసపోరని తెలిపారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ హేమంత్‌కుమార్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ చాముండేశ్వరి, విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ చైర్‌పర్సన్ పవిత్ర, మాజీ కో-ఆర్డినేటర్ సీవీ కుమార్, పార్టీ పట్టణ కన్వీనర్ జాఫర్, రాష్ట్ర కార్యదర్శి మురళీకృష్ణ, మాజీ కన్వీనర్ మండీ సుధా, మున్సిపల్ వైస్ చైర్మన్లు, కౌన్సిలర్లు సల్మాశ్యామ్, రహీంఖాన్, ఫయాజ్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఎన్నికల ఫిర్యాదులకు కాల్ చేయండి

చిత్తూరు కలెక్టరేట్ : ఎన్నికలకు సంబంధించి ఫిర్యాదులుంటే కాల్ చేసి తెలియజేయాలని అబ్జర్వర్‌లు కోరారు. గురువారం వారు మాట్లాడుతూ తమ సెల్ నంబర్లను వెల్లడించారు.

- చిత్తూరు పార్లమెంట్ సెగ్మెంట్ వ్యయఖర్చుల అబ్జర్వర్ ప్రసాద్ శర్మ : 9281448308.
- నగరి, జీడీనెల్లూరు అసెంబ్లీ సెగ్మెంట్ల జనరల్ అబ్జర్వర్ కై లాశ్ వాంఖడే : 9281448305.
- చిత్తూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం జనరల్ అబ్జర్వర్ షాధిక్ : 92814 48302.
- పుంగనూరు, జీడీనెల్లూరు అసెంబ్లీల వ్యయఖర్చుల అబ్జర్వర్ శ్రీనివాస్ ఖన్నా : 9281448307.
- చిత్తూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం అసెంబ్లీల వ్యయఖర్చుల అబ్జర్వర్ రోహన్ ఠాకూర్ : 9281448306.

దూసుకొచ్చిన మృత్యువు

బెంగళూరులో రైలు ఢీకొని ముగ్గురి మృతి

కృష్ణరాజపురం/ బనశంకరి (బెంగళూరు): బెంగళూరు నగరంలోని కృష్ణరాజపురం పరిధిలో బైయ్యప్పనహళ్లి రైల్వే స్టేషన్ వద్ద రైలు ఢీకొని ముగ్గురు యువకులు దుర్మరణం చెందారు. మృతులు చిత్తూరుకు చెందిన శశికుమార్, లోకేష్, సుబ్రమణ్యంగా గుర్తించినట్లు పోలీసులు తెలిపారు. వీరందరూ పాతికేళ్ల వయసువారే. ఉపాధి కోసం ఇటీవల బెంగళూరుకు వచ్చినట్లు తెలుస్తోంది. బుధవారం రాత్రి 8.30 సమయంలో రైల్వే ట్రాక్ మీద మొబైల్‌లో హెడ్‌ఫోన్ పెట్టుకుని వీడియోలు చూస్తుండగా బెంగళూరు- కణ్ణూరు ఎక్స్‌ప్రెస్ రైలు దూసుకొచ్చి వారిని ఢీకొనడంతో పక్కనే ఉన్న కాలువలోకి పడి అక్కడికక్కడే మృతి చెందారు. గురువారం ఉదయం స్థానికులు చూసి సమాచారం అందించడంతో పోలీసులు చేరుకుని మృతదేహాలను స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

వైఎస్సార్‌సీపీలోకి భారీగా వలసలు



నౌషాద్‌ను పార్టీలో ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి విజయానందరెడ్డి



పార్టీలో చేరిన నేతలతో విజయానందరెడ్డి



వైఎస్సార్‌సీపీలో చేరిన గడ్డూరు నాయకులు



పార్టీలో చేరిన గంగనపల్లెకు చెందిన లోకిజానకిరామ్, దేవిక



వైఎస్సార్‌సీపీలో చేరిన మాజీ సర్పంచ్ శివలింగయ్య

చిత్తూరు కార్పొరేషన్ : జిల్లాలోని పలు నియోజకవర్గాల్లో టీడీపీ, జనసేన నుంచి పలువురు నేతలు వైఎస్సార్‌సీపీలో చేరారు. గురువారం ఆయా ప్రాంతాల్లో అభ్యర్థులు, నేతలు వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అందులో భాగంగా టీడీపీ రాష్ట్ర మైనార్టీ విభాగం అధికార ప్రతినిధి నౌషద్ , మరో 70 టీడీపీ, జనసేన నాయకుల కుటుంబాలు పార్టీలో చేరారు. వైఎస్సార్‌సీపీ చిత్తూరు ఎమ్మెల్యే అభ్యర్థి విజయానందరెడ్డి కండువా వేసి ఆహ్వానించారు. పార్టీలో చేరినవారిలో టీడీపీ నగర మైనార్టీ ప్రధాన కార్యదర్శి నవాజ్, మాజీ కో-ఆప్షన్ సభ్యులు నసీమా, నాయకులు రియాజ్, ఫయాజ్, షఫీ, రౌనక్, సల్మాన్, గౌస్, మసూద, చాన్‌బాషా, ఆరీఫ్, శ్రీనివాస్, మస్తాన్, జలీనాబాషా ఉన్నారు. నౌషాద్ మాట్లాడుతూ మైనారిటీలకు టీడీపీలో గుర్తింపు లేదన్నారు. మతతత్వ బీజేపీతో పొత్తు పెట్టుకున్న కూటమిలో ఇమడలేకపోయమని తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ చంద్రశేఖర్, జిల్లా మైనారిటీ అధ్యక్షుడు సయ్యద్, కో-ఆప్షన్ సభ్యుడు అను, కార్పొరేటర్ ఇందు, నాయకులు ఏకాంబరం, సంతోష్, సీతపతి పాల్గొన్నారు.



వైఎస్సార్‌సీపీలో చేరిన ముద్దేపల్లె వాసులు

చిత్తూరు మండలంలో..

చిత్తూరు రూరల్ (కాణిపాకం): చిత్తూరు మండలం పాలూరు, ఆనగల్లు పంచాయతీ నుంచి ఇద్దరు టీడీపీ నాయకులు వైఎస్సార్‌సీపీలో చేరారు. ఎమ్మెల్యే అభ్యర్థి విజయానందరెడ్డి వారికి కండువాలు వేసి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు.

పలమనేరులో 100 కుటుంబాలు

పలమనేరు : నియోజకవర్గంలోని పలు గ్రామాలకు చెందిన వంద కుటుంబాల వారు ఎమ్మెల్యే వెంకటేగౌడ సమక్షంలో వైఎస్సార్‌సీపీలోకి చేరారు. పార్టీలో చేరిన వారిలో కృష్ణప్ప, బాలాజీ, శంకరప్ప, రవి, వెంకటేశ్, వెంకటాచలం, ప్రకాష్, రాజు, వెంకట్రమణ, శంకరప్ప, రవికుమార్, పరమశైకల్లర్ కుల సంఘ నేత ఈశ్వర్, హరి, సిద్దు, పవన్, సాయి ఉన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ హేమంత్‌కుమార్‌రెడ్డి, పార్టీ పట్టణ కన్వీనర్ జాఫర్, మాజీ కన్వీనర్ మండీ సుధా, కౌన్సిలర్లు రాజేష్, శ్యామ్, ఫయాజ్ తదితరులున్నారు.

పార్టీలోకి టీడీపీ మాజీ సర్పంచ్

బంగారుపాళెం: మండలంలోని బొమ్మాయిపల్లె టీడీపీ మాజీ సర్పంచ్ శివలింగయ్య తన అనుచరులతో కలసి వైఎస్సార్‌సీపీలో చేశారు. వారికి పార్టీ మండల కన్వీనర్ రామచంద్రారెడ్డి, పాలఏకరి కార్పొరేషన్ చైర్మన్ కుమార్‌రాజా, వైస్ ఎంపీపీ శిరీషరెడ్డి, పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు శరత్‌రెడ్డి పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీలోకి భారీగా చేరికలు

చిత్తూరు కార్పొరేషన్: నగరంలోని పలు ప్రాంతాలకు చెందిన టీడీపీ నాయకులు, కార్యకర్తలు కుటుంబాలతో సహా గురువారం వైఎస్సార్‌సీపీలో భారీగా చేరారు. నగర పార్టీ కార్యాలయంలో చిత్తూరు ఎమ్మెల్యే అభ్యర్థి విజయానందరెడ్డి వారికి కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీ బలోపేతానికి అందరూ కృషి చేయాలన్నారు.

- స్థానిక 40వ డివిజన్ తోటపాళ్యంలో టీడీపీ నాయకులు బలరామ్, సంతోష్‌ఆధ్వర్యంలో 30 మంది వైఎస్సార్‌సీపీలో చేరారు. గోపి, రమేష్, వినోద్, విజయ్, మనోజ్, లక్ష్మణ్‌రాజ్, సుహాస్, యహోమియ, చందు, మనోహర్, జాన్, బిల్లి, రవికుమార్, రాజ్‌కుమార్, శశికుమార్, పుష్ప, చిన్నమి, పావని, నాగమ్మ, లక్ష్మి, వాణి, గణేష్ తదితరులు పార్టీలో చేరిన వారిలో ఉన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ గణేష్, నాయకులు శరవణ తదితరులు పాల్గొన్నారు.
- 44వ డివిజన్ రంగాచ్చారివీధి పరిధిలోని టీడీపీ నాయకురాలు వంశీప్రియ 25 మంది అనుచరులతో కలిసి వైఎస్సార్ సీపీలో చేరారు. రాజేశ్వరి, భావన, గీత, పుష్పమ్మ, ప్రేమ, అమ్ములు, సురేష్, జ్ఞానేశ్వరి, గీత, దివ్య, ఉష, ప్రకాష్, చిన్నా, నాని, నిత్య, మల్లికమ్మ, కందమ్మ, ఉమమ్మ, జ్యోతిమ్మ, యశోద, కాంచన, లక్ష్మమ్మ, సావిత్రి తదితరులు పార్టీలో చేరారు. గత నగరపాలక ఎన్నికల్లో తమ డివిజన్ పరిధిలో టీడీపీ కార్పొరేటర్‌గా పోటీ చేసి తాను ఓడిపోయినట్లు వంశీప్రియ తెలిపారు. వైఎస్సార్‌సీపీ పాలనలో జరిగిన అభివృద్ధిని చూసి పార్టీలో చేరానన్నారు. నాయకులు సైఫ్, నవాజ్, గఫార్, గౌస్ తదితరులు పాల్గొన్నారు. అలాగే 33వ డివిజన్ గంగనపల్లెలోని టీడీపీ నాయకులు జానకిరామ్, దేవిక పార్టీలో చేరారు. కార్యక్రమంలో నాయకులు వినోద్, తన్మిష్ పాల్గొన్నారు.



వైఎస్సార్‌సీపీలోకి చేరిన టీడీపీ నేతలు



పార్టీలో చేరిన వంశీప్రియ, టీడీపీ నాయకులు



పార్టీలో చేరిన మల్లికార్జున తదితరులు

వలంటీర్ల పనితీరు ప్రశంసనీయం

- జీసీవై అధ్యక్షుడు రామచంద్ర యాదవ్

పుంగనూరు : వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నియమించిన వలంటీర్ల పనితీరు ప్రశంసనీయమని, వారు ప్రజలకు ఎంతో సేవలు అందించారని బీసీవై పార్టీ అధ్యక్షుడు రామచంద్ర యాదవ్ తెలిపారు. గురువారం పట్టణంలో ర్యాలీ నిర్వహించి ఎమ్మెల్యే అభ్యర్థిగా తన పార్టీ తరఫున నామినేషన్ దాఖలు చేశారు. విలేకర్లతో మాట్లాడుతూ వలంటీర్ల వ్యవస్థ అద్భుతమైన సేవలు అందిస్తోందని వెల్లడించారు.

చిత్తూరులో యువకుడి హత్య

చిత్తూరు అర్బన్: నగరంలో ఆశిక్ (32) అనే యువకుడు గురువారం రాత్రి హత్యకు గురయ్యాడు. టూటౌన్ సీఐ ఉలసయ్య కథనం మేరకు.. కేరళకు చెందిన ఆశిక్ కూలి పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. మూడు నెలల క్రితం తిరుపతి నుంచి భార్యాబిడ్డలతో కలిసి చిత్తూరు నగరంలోని తోటపాళ్యంలో కాపురం పెట్టాడు. గురువారం రాత్రి ఓబనపల్లె వద్ద ఉన్న మద్యం దుకాణంలో ఆశిక్ మద్యం తాగుతుండగా అక్కడే ఉన్న ఇద్దరు యువకులతో గొడవ జరిగింది. అక్కడ నుంచి ఇంటికి వస్తుండగా గొడవ పడ్డ యువకులు ద్విచక్ర వాహనంపై వచ్చి కత్తులతో దాడి చేశారు. కత్తిపోట్లకు గురైన ఆశిక్ పరిగెత్తుతున్నా వదలకుండా వెంటాడి పొడిచారు. దీంతో ఆశిక్ అక్కడికక్కడే మృతి చెందాడు. నిందితులు పరారయ్యారు. మృతుడికి భార్య ముగ్గురు పిల్లలు ఉన్నారు. మృతదేహాన్ని చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించి టూ టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడి మృతి

పూతలపట్టు: మండలంలోని వావిల్‌తోట పంచాయతీ నయనంపల్లెకు చెందిన జయరామ్‌నాయుడు (63) అనే వృద్ధుడి గురువారం ఉదయం రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. బైక్‌పై అమ్మగారిపల్లెకు వెళ్లి తిరిగి ఇంటికి వచ్చేందుకు రోడ్డు దాటుతుండగా తిరుపతి నుంచి చిత్తూరు వైపు వెళ్తున్న కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో జయరామ్‌నాయుడు అక్కడిక్కడే మరణించాడు. పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని కారు డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



జయరామ్‌నాయుడు (ఫైల్)

బోయకొండ హుండీ ఆదాయం రూ.75.32 లక్షలు

చౌడేపల్లె: ప్రసిద్ధ బోయకొండ గంగమ్మ ఆలయానికి హుండీ కానుకల ద్వారా రూ.75.32 లక్షల ఆదాయం సమకూరినట్లు దేవస్థానం చైర్మన్ నాగరాజారెడ్డి, కార్యనిర్వహణాధికారి చంద్రమౌళి తెలిపారు. గురువారం 63 రోజులకు సంబంధించిన హుండీ కానుకలను లెక్కించారు. నగదు రూ.74,79,615, బంగారం 42గ్రాములు, వెండి 540 గ్రాములు లభించినట్లు పేర్కొన్నారు. అలాగే రణభేరి గంగమ్మ ఆలయం వద్ద ఏర్పాటుచేసిన హుండీ ద్వారా రూ.53,046 ఆదాయం సమకూరినట్లు తెలిపారు. పాలక మండలి సభ్యులు హైమావతి, భాస్కర్‌రెడ్డి, బుడ్డమ్మ, ఆలయ, బ్యాంకు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

టీడీపీ నేత నిర్వాకం

– సీసీ రోడ్డు ధ్వంసం

బైరెడ్డిపల్లె : మండలంలోని టీఎన్‌కుప్పం వెళ్లే సీసీ రోడ్డును ఓ టీడీపీ నేత ధ్వంసం చేసి తన పొలానికి నీటి పైప్‌లైన్ వేసుకోవడంపై గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వివరాలు.. ఎన్నో ఏళ్లుగా గ్రామానికి వెళ్లే రహదారి గుంతలు పడి తీవ్ర ఇబ్బందులు పడేవాళ్లు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో గ్రామంలో పర్యటించిన ఎమ్మెల్యే వెంకటేగౌడ దృష్టికి సమస్యను తీసుకెళ్లారు. ఆయన స్పందించి సీసీ రోడ్డు వేయించారు. నిక్షేపంగా ఉన్న రోడ్డును టీడీపీ నేత తన స్వార్థం కోసం నాశనం చేశారని గ్రామస్తులు మండిపడుతున్నారు.

తథ్యం..వైఎస్సార్ సీపీ ప్రభంజనం



సమావేశంలో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం నారాయణస్వామి

- టీడీపీకి 'కమలం' అమ్ముడు పోయింది
- ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి

గంగాధర నెల్లూరు: రాష్ట్రంలో వైస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభంజనాన్ని ఎవరు అడ్డుకోలేరని ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి అన్నారు. గురువారం మండల పరిధిలోని వేల్కూరులో ఉప ముఖ్యమంత్రి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ప్రజలంతా జగనన్న వెంటే ఉన్నారని తెలిపారు. ఎక్కడికి వెళ్లినా జనం అశేషంగా తరలిరావడం ఇందుకు ఉదాహరణ అని పేర్కొన్నారు. తెలుగుదేశం పార్టీకి భారతీయ జనతా పార్టీ అమ్ముడుపోయిందని, పురంధేశ్వరి బీజేపీ అధ్యక్షురాలా? టీడీపీ అధ్యక్షురాలా? అని ప్రశ్నించారు. ఎవరు ఎన్ని కుయుక్తులు పన్నినా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి కావడం ఖాయమన్నారు. రాష్ట్రంలోని 175 స్థానాల్లో సంక్షేమ పథకాల రూపశిల్పి సీఎం జగనన్నే అభ్యర్థి అని, రాష్ట్రం మొత్తం ఆయన చేసిన అభివృద్ధిని చూసి ఓటు వేయనున్నారని, 175కి 175 స్థానాలు గెలవడం తథ్యమని తెలిపారు. గత ప్రభుత్వంలో చంద్రబాబు కులాల మధ్య, మతాల మధ్య చిచ్చు పెట్టారని, జగనన్న పాలనలో కుల,మత, పార్టీలకతీతంగా, అర్హతే ప్రామాణికంగా పథకాల లబ్ధి అందిందని పేర్కొన్నారు. సమావేశంలో వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు పూర్ణచంద్ర రెడ్డి, సీడీఎంఎస్ మాజీ అధ్యక్షుడు బాబురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ అభ్యర్థి ర్యాలీలో రేషన్ డీలర్



ర్యాలీలో డీలర్ మంజునాథ్

పలమనేరు : పట్టణంలోని ఈనెల 22వ తేదీన జరిగిన మాజీ మంత్రి అమరనాథ్‌రెడ్డి నామినేషన్ కార్యక్రమ ర్యాలీలో వి.కోట మండలం మావత్తూరు గ్రామానికి చెందిన రేషన్ డీలర్ ఎం.మంజునాథ్ పాల్గొన్నారు. ఈక్రమంలో టీడీపీకి అనుకూలంగా ప్రచారం చేసిన విషయం ఆలస్యంగా వెలుగుచూసింది. దీనిపై మండలానికి చెందిన పలువురు ఎన్నికల అధికారులకు గురువారం ఫిర్యాదు చేశారు. ర్యాలీలో పాల్గొనడమే కాకుండా ఆ ఫొటోలు, వీడియోలను సామాజిక మాధ్యమాల్లోనూ వైరల్ చేసినట్టు తెలుస్తోంది.

బీజేపీ పాలనలో అన్నీ ప్రైవేటీకరణలే!

చిత్తూరు కలెక్టరేట్ : బీజేపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి దేశవ్యాప్తంగా ప్రైవేటీకరణలు అమలవుతున్నాయని కాంగ్రెస్ పార్టీ చిత్తూరు ఎంపీ అభ్యర్థి జగపతి విమర్శించారు. గురువారం కలెక్టరేట్‌లో ఆయన నామినేషన్ ను దాఖలు చేశారు. అనంతరం విలేకర్లతో మాట్లాడుతూ బీజేపీని ప్రజలు ఆదరించడం లేదన్నారు. తన వంతు కృషి చేసి ఎన్నికల్లో గెలిచేందుకు ప్రయత్నిస్తానని తెలిపారు. కాంగ్రెస్ అధికారంలోకొస్తే మామిడి, చెరుకు రైతులకు మేలు చేస్తామని చెప్పారు. చంద్రబాబు పాలనలో షుగర్ ఫ్యాక్టరీని మూసివేసి రైతులను అన్యాయం చేశారని విమర్శించారు. చెరకు రైతులకు మద్దతు ధర కల్పిస్తామన్నారు. ఎమ్మెల్యే అభ్యర్థి తుకారాం మాట్లాడుతూ తనను గెలిపిస్తే చిత్తూరు అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానన్నారు. ఎలాంటి ప్రలోభాలకు పాల్పడకుండా ప్రజల మద్దతు కోరుతున్నట్లు తెలిపారు.

ఓపెన్ స్కూల్ ఫలితాలు విడుదల



డీఈఓ దేవరాజు

చిత్తూరు కలెక్టరేట్ : ఏపీ ఓపెన్ స్కూల్ సొసైటీ పది, ఇంటర్మీడియట్ పరీక్షల ఫలితాలు గురువారం విడుదలయ్యాయి. ఈ సందర్భంగా డీఈఓ దేవరాజు మాట్లాడుతూ పదవ తరగతిలో రాష్ట్రంలో చిత్తూరు జిల్లాకు 5వ స్థానం, ఇంటర్‌లో 8వ స్థానం వచ్చినట్లు వెల్లడించారు. పదవ తరగతికి 1089 మంది పరీక్షలు రాయగా, 861 మంది (79.06 శాతం) ఉత్తీర్ణత సాధించారన్నారు. ఇంటర్మీడియట్ పరీక్షలకు 3,956 మంది హాజరుకాగా 3117 మంది(78.79 శాతం) ఉత్తీర్ణత సాధించినట్లు తెలిపారు.

సమయం అయిపోయింది మిత్రమా..!



వెనుదిరుగుతున్న ఇండిపెండెంటెంట్ అభ్యర్థి

చిత్తూరు కలెక్టరేట్ : చిత్తూరు ఎంపీ స్థానానికి నామినేషన్ వేసేందుకు కలెక్టరేట్‌కు విచ్చేసిన అభ్యర్థి రెండు నిమిషాలు ఆలస్యంగా రావడంతో లోనికి అనుమతి లభించలేదు. సార్వత్రిక ఎన్నికలకు నామినేషన్‌లు దాఖలు చేసేందుకు గురువారం ఆఖరు గడువు. ఈ క్రమంలో పలమనేరుకు చెందిన రెడ్డెప్ప అనే వ్యక్తి చిత్తూరు ఎంపీ స్థానానికి ఇండిపెండెంట్ అభ్యర్థిగా నామినేషన్ వేసేందుకు కలెక్టరేట్‌కు వచ్చారు. నామినేషన్‌లు దాఖలు చేసేందుకు ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు మాత్రమే అవకాశం ఉంటుంది. అయితే ఆ అభ్యర్థి మధ్యాహ్నం 3.02 గంటలకు రావడంతో పోలీసులు తలుపులు వేసేశారు. అభ్యర్థి ఎంత ప్రాధేయపడినా పోలీసులు లోనికి అనుమతించలేదు.

ముగిసిన నామినేషన్ల ఘట్టం

- 310 సెట్లు దాఖలు చేసిన 264 మంది అభ్యర్థులు
- నేడు నామినేషన్ల పరిశీలన



చిత్తూరు పార్లమెంట్ స్థానానికి నామినేషన్ దాఖలు చేస్తున్న పిరమిడ్ పార్టీ అభ్యర్థి భూలక్ష్మి

చిత్తూరు కలెక్టరేట్ : సార్వత్రిక ఎన్నికల్లో కీలకమైన నామినేషన్‌ల స్వీకరణ ఘట్టం గురువారంతో ముగిసింది. ఈ నెల 18 నుంచి 25వ తేదీ వరకు నామినేషన్‌లను ఆయా నియోజకవర్గాల ఆర్‌ఓలు అభ్యర్థుల నుంచి స్వీకరించారు. ప్రధాన పార్టీల అభ్యర్థులతో పాటు స్వతంత్ర్య అభ్యర్థుల నుంచి భారీ సంఖ్యలో నామినేషన్‌లు వెలువెత్తాయి. గురువారం చివరి రోజు కావడంతో రాజకీయపార్టీల అభ్యర్థులు ఏ,బీ ఫారాలలో హుటాహుటిన ఆర్‌ఓ కేంద్రాలకు వచ్చి నామినేషన్‌లు దాఖలు చేశారు. ఈ క్రమంలో చిత్తూరు పార్లమెంట్ సెగ్మెంట్‌కు మొత్తం 48 మంది అభ్యర్థులు 58 సెట్ల నామినేషన్లు సమర్పించారు. అలాగే జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించి 216 మంది అభ్యర్థులు 254 సెట్ల నామినేషన్లు వేశారు.

నేడు పరిశీలన

జిల్లా వ్యాప్తంగా దాఖలైన 310 సెట్ల నామినేషన్‌లను ఆయా ఆర్‌ఓ కేంద్రాల్లో శుక్రవారం పరిశీలన చేయనున్నారు. ఈ ప్రక్రియ ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు నిర్వహించనున్నారు. ఈ నెల 29వ తేదీ సాయంత్రం 3 గంటల వరకు నామినేషన్‌ల ఉపసంహరణకు అవకాశం కల్పించారు. అనంతరం సార్వత్రిక ఎన్నికల్లో బరిలో ఉండే పార్లమెంట్, అసెంబ్లీ అభ్యర్థుల జాబితాను అధికారులు వెల్లడించనున్నారు.